క్లుప్తంగా

టెంకాయల వేలంపాట ద్వారా రూ.11.70 లక్షల ఆదాయం

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరు గ్రామంలోని అంకాలమ్మ ఆలయా నికి టెంకాయల వేలంపాట ద్వారా రూ.11.70 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయంలో టెంకాయల విక్రయానికి వేలంపాట నిర్వహించగా.. సింహాద్రిపురానికి చెందిన గోపాల్‌రెడ్డి రూ.11.70 లక్షలకు వేలంపాటలో టెంకాయల విక్రయాన్ని దక్కించుకున్నారు. ఈ వేలం పాటను ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ పర్యవేక్షించారు.

నివాళి


రామసుబ్బారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో నివాసముంటున్న రిటైర్డు ఎంఈఓ సోమా రామ సుబ్బారెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మృతుడు కుమారుడు సాక్షి ఐటీ విభాగం జనరల్ మేనేజర్ భాస్కర్‌రెడ్డిని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రామసుబ్బారెడ్డి దొండ్లవాగు గ్రామంలో హెడ్మాస్టర్‌గా పనిచేయడంతో పాటు సింహాద్రిపురం మండల ఎంఈఓగా పదవీ బాధ్యతలు చేపట్టి ఉత్తమ సేవలు అందించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు.

ఎర్రచందనమా.. సాధారణ దుంగలా?

ముద్దనూరు, జమ్మలమడుగు రూరల్ : ముద్దనూరు అటవీశాఖ అధికారులు, జమ్మలమడుగు పోలీసులు కలిసి బుధవారం ఎర్రచందనం దుంగలనుకొని సాధారణ దుంగలను పట్టుకున్నట్లు సమాచారం. వివరాలలోకి వెళ్తే.. జమ్మలమడుగులో రామిరెడ్డిపల్లె రహదారిలో ఓ కార్పెంటర్ వద్ద నుంచి సుమారు 40 దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకుని అటవీశాఖ సిబ్బందికి అప్పగించారు. అయితే ఈ దుంగలను పరీక్షించడానికి వాటిని ముద్దనూరు ఫారెస్టు అధికారులకు అప్పగించారు. తీరా తాము స్వాధీనం చేసుకున్నవి ఎర్రచందనం దుంగలు కావని అవి ఇంటికి పాతకాలంలో వాడే మొద్దులని తేలినట్లు సమాచారం. జమ్మలమడుగుకు చెందిన ఇరువురి వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఈ విషయంపై ముద్దనూరు ఫారెస్టు రేంజర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పట్టుబడిన దుంగలను పరీక్షించామని ఎర్రచందనం కావని అయితే రేపు మరో సారి వాటిని పరీక్షిస్తామని ఆయన తెలిపారు.

కళింగర సాగు.. లాభాలు బాగు


పులివెందుల ప్రాంతంలో సాగులో ఉన్న కళింగర పంట

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని రైతులు కళింగర సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నియోజకవర్గంలోని వేంపల్లె, లింగాల, పులివెందుల, వేముల ప్రాంతాలలో సుమారు 100 ఎకరాలలో కలింగర సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కళింగ సాగుకు ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెడితే ఆదాయం లక్ష రూపాయలు వస్తోందని రైతులు అంటున్నారు. దీంతో రైతులు కళింగర సాగుపై మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్ టన్ను కళింగర కాయల ధరలు బాగానే ఉంటున్నాయి. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సాగు చేసిన కళింగర పంటను కర్నూలు, ఆదోని, హిందూపురం, అనంతపురం, మదనపల్లె, కడప, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు వచ్చి కొనుగోలు చేసుకుని వెళ్తుంటారు.

టన్ను కళింగర ధర రూ.11వేలు


ఏపుగా కాసిన కళింగర కాయలు

ప్రస్తుత వేసవికాలం ప్రారంభం కావడంతో కళింగర కాయలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. దీంతో టన్ను కళింగర మొదటి కాపు రూ.11 వేలు, రెండవ కాపు రూ.6 వేల నుంచి రూ.7 వేలకు విక్ర యిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కళింగరకు మార్కెట్‌లో కూడా మంచి డిమాండ్ ఉందని రైతులు వాపోతున్నారు. వేసవి కాలంలో ప్రతి ఒక్కరికి చల్లదనాన్ని అందించే కళింగర కాయలను తినడానికి ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కళింగర సాగును ఎక్కువ రైతులు మక్కువ చూపి కళింగర పంటను సాగు చేసినట్లు రైతులు అంటున్నారు. కళింగర పంట సాగు చేయడంవల్ల ఖర్చులు తక్కువయినప్పటికీ ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఆదాయం బాగుందని రైతులు వాపోతున్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం


మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ సీఐ చెన్నారెడ్డి

వేంపల్లె : మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని పులివెందుల ఎక్సైజ్ శాఖ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనలో యువత పాత్రపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు ఉపయోగించడం చట్టరీత్యా నేరమని, వీటికి అలవాటు పడి తమ భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. అలాగే దీనివల్ల శరీరంలో కలిగే దుష్ప్రభావం చూపే అవకాశం ఉందని, వీటిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచీకరణలో భాగంగా యువత ఎదుర్కొంటున్న సవాళ్లలో మాదక ద్రవ్యాలు ఒకటని, నివారించేందుకు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోండి


మురుగు నీటి నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి మనోరమ

వేముల : ఆయా సీజన్లల్లో దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ కార్మికులకు సూచించారు. బుధవారం వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెస్తవారిపల్లె సమీపంలో రోడ్డు నిర్మాణ కార్మికుల కోసం నిర్మించిన తాత్కాలిక నివాస గృహాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్మికులకు దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలను వివరించారు. దోమ కాటువల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధక వ్యాధి, మెదడు వాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. రాత్రివేళల్లో దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు ఏసీఎం మందును పిచికారి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సహాయ అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సూపర్‌వైజర్ రమేష్, ఆరోగ్య కార్యకర్తలు నాగేశ్వరి, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కోసం వెళ్తుండగా..


లారీ ఢీ కొన్న ప్రమాదంలో మృతి చెందిన పి. నారాయణమ్మ

కొండాపురం : మండల పరిధిలోని ఏటూరు గ్రామ సమీపంలోని వేబ్రిడ్జి ఎదురుగా జాతీయ రహదారిపై ఎద్దుల బండిని లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో పెద్దిరెడ్డిగారి నారాయణమ్మ(52) అనే మహిళ దుర్మరణం చెందగా ఎద్దు కూడా అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దులబండి నడుపుతున్న పెద్దిరెడ్డిగారి రాఘవరెడ్డికి కాలు విరగడంతో పాటు వెన్నెముక దెబ్బతిన్నట్లు స్థానికులు తెలిపారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశవరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ వివరాల మేరకు మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన పెద్దిరెడ్డిగారి రాఘవరెడ్డి తన భార్య పి. నారాయణమ్మతో కలసి ఎద్దుల బండిలో వెంకటాపురం సమీపంలోని తోట వద్దకు పశుగ్రాసం కోసుకు వచ్చేందుకు బయలుదేరారు. ఈ సమయంలో తాడిపత్రి వైపు నుంచి కడప వైపు వెళుతున్న లారీ ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతురాలి భర్త పి. రాఘవరెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు అదుపుతప్పి ఇరువురికి గాయాలు


నుజ్జునుజ్జుగా మారిన కారు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని మద్దిమడుగు–సుగాలి బిడికి మధ్య జాతీయ రహదారిపై బుధవారం రాయచోటి వైపు నుంచి వేగంగా వస్తున్న టీఎస్ 23 సీయూ 7536 నెంబరుగల షిఫ్ట్ డిజైర్ కారు అదుపుతప్పి రైలింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ కోటిరెడ్డి, విష్ణు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే రక్షక్ సిబ్బంది స్పందించి బాధితులను వాహనం నుంచి బయటకు తీసి, 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు జ్యూట్ బ్యాగ్‌ల పంపిణీ


జ్యూట్ బ్యాగ్‌లు అందుకున్న విద్యార్థులతో యూసీఐఎల్ జీఎం సుమన్ సర్కార్

వేముల : వేములలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో బుధవారం విద్యార్థులకు యూసీఐఎల్ జీఎం సుమన్ సర్కార్ జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం లేకుండా ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగ్‌లను, గుడ్డ సంచులను వాడాలని సూచించారు. అలాగే ఐటీఐ, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు తాగునీటి కొరకు రూ.6 లక్షలతో నిర్మిస్తున్న ఆర్ఓ ప్లాంట్లుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామసుబ్బయ్య, చీఫ్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, సీఎస్ఆర్ అధికారి నవీన్ కుమార్‌రెడ్డి, సీఎస్ఆర్ కో ఆర్డినేటర్ గంగిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి చూపును కాపాడుకోవాలి

తొండూరు : ప్రతి ఒక్కరూ కంటి చూపును కాపాడుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జీవీ లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా అంధత్వ నివారణా కార్యక్రమంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కంటిచూపుతో బాధపడుతున్న 20 మంది విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్ : జాతీయ స్థాయి సైన్స్ ఒలంపియాడ్‌లో పట్టణంలోని నలంద పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ బి.సోమేశ్వరరెడ్డి తెలిపారు. జాతీయ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు సైన్స్‌పట్ల ఆసక్తిని పెంపొందించుకుంటారని ప్రిన్సిపాల్ బి.వెంకటస్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సి.విజిత, ఉపాధ్యాయులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

నేత్రదానం బృహత్కార్యం

పులివెందుల టౌన్ : నేత్రదానం బృహత్కార్యమని.. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో నివాసముంటున్న సోమా రామసుబ్బారెడ్డి(79) మరణించారు. దీంతో మృతుడి భార్య సరోజినీదేవి, కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెటింగ్ స్కిల్స్ ఎంతో అవసరం

పులివెందుల టౌన్ : వ్యాపారాభివృద్ధికి మార్కెటింగ్ స్కిల్స్ నేర్చుకోవడం ఎంతో అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎస్సీఎస్ఎస్‌డీపీ హిందుస్తాన్, కోకోకోలా బెవరేజెస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సేల్స్ అండ్ మార్కెటింగ్ నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ వృత్తి విద్యకు సంబంధించి విద్యార్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడంవల్ల విద్యార్థుల ఆలోచనలు, ప్రవత్తుల నైపుణ్యాలను మెరుగుపరుచుకోవచ్చునన్నారు. అనంతరం ప్రాజెక్టు మేనేజర్ ఖలీల్ బాషా మార్కెటింగ్ స్కిల్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టస్ వన ఫాదర్, ఏపీ స్కిల్ సెంటర్ మెంటర్ కేశవ, కో ఆర్డినేటర్ ఐక్యూఏసీ రమణారెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


విగ్రహ ప్రతిష్ట చేస్తున్న వేద పండితులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని నడివూరులో నూతనంగా నిర్మించిన శ్రీ మహా అంకమ్మతల్లి (పార్వతిదేవి) దేవస్థానం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయంలో శ్రీ అంకమ్మతల్లి, గణపతి, సుబ్రమణ్య, సింహవాహనం, ధ్వజ శిఖర కలిశ స్థాపనలు చేశారు. అనంతరం నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వేదపండుతులు మంత్రోచ్ఛరణలతో ప్రాణ ప్రతిష్ట చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ప్రతిష్ట మహోత్సవంను తిలకించారు.

నేడు బండలాగుడు పోటీలు

విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఒంగోలు జాతి సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలను గురువారం నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు కడప రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జరుగుతాయన్నారు. మొదటి బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.25 వేలు, నాల్గువ బహుమతి రూ.20 వేలు ఇవ్వనున్నారు

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న జిల్లా సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

పులివెందుల రూరల్ : ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆయన సందర్శించి రిజిష్టర్లను పరిశీలించి మాట్లాడారు. లీగల్ ఎయిడ్‌క్లినిక్ ప్రాధాన్యత, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి తెలియజేశారు. అలాగే ఆయన ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండ్, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఖైదీలు పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణమే ప్రథమ కర్తవ్యం


ఆర్టీసీ బస్సు కండీషన్‌ను పరిశీలిస్తున్న రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణమే డ్రైవర్ల ప్రథమ కర్తవ్యమని కడప ఆర్టీసీ రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు తన కుటుంబం కూడా ఉందని గ్రహించాలని ఆయన డ్రైవర్లకు సూచించారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్లలో మాట్లాడటం వల్ల ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే మద్యం సేవించి విధులకు వస్తే వారిపై కఠినంగా వ్యవహరించి ఉద్యోగాల నుండి తొలగిస్తామన్నారు. బస్సు కండీషన్ గురించి చూసుకోవలసిన బాధ్యత డ్రైవర్‌పై ఉందన్నారు. అనంతరం డిపోలోని బస్సులను రిజిస్టర్‌లను ఆయన తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోటి గోటితో తలంబ్రాలు

వేంపల్లె : భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవంలో స్వామివారి తలంబ్రాలకు వడ్లను శ్రీ మంగళగౌరీ దేవస్థానంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో మహిళలు గోటితో వలచి తలంబ్రాలను తయారు చేశారని సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్లు తెలిపారు. బుధవారం ఆలయంలో గౌరీదేవి అష్టోత్తరాలు, లలితసహస్ర నామాలు, శ్రీరామ సంకీర్తనలతో భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ఇందులో పాల్గొడం ఎంతో అదృష్టమని మహిళలు తెలిపారు. బలిజ సంఘం మహిళా మండలి అధ్యక్షురాలు రత్నాలమ్మ, బలిజ సంఘం గౌరవ సలహాదారులు రాజారామ్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు ప్రవీణ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలి

కమలాపురం : మండలంలోని రైతు లందరూ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పని సరిగా చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని పుట్లంపల్లె, మీరాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో భాగంగా ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించి నువ్వులు, వేరు శనగ, కళింగర పంటలను పరిశీలించారు. పంటలలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలను వివరించారు. ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య అందిస్తోందన్నారు. ఈ 14 అంకెల విశిష్ట సంఖ్య ఉంటేనే ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతాయన్నారు. ప్రతి రైతు సంబంధిత ఆర్ఎస్‌కేలకు వెళ్లి రైతు రిజిస్ట్రీ చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

సింహాద్రిపురం : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, శ్రీవివేకానంద ఉన్నత పాఠశాలల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా బుధవారం విద్యార్థులకు లింగ వివక్షత అనే అంశంపై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎస్ఐ తులసీ నాగప్రసాద్ పర్యవేక్షించారు. అనంతరం పెయింటింగ్ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం (రేపు) ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్ఠు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు.

ఇ క్రాప్ నమోదుకు నేడు చివరి అవకాశం

పెద్దముడియం : రబీలో సాగు చేసిన పంటలకు ఇ క్రాప్ నమోదుకు నేడు చివరి అవకాశం అని మండల వ్యవసాయాధికారి అరుణ తెలిపారు. మార్చి 1 వరకు ఉన్న గడువును ఈనెల 6 వరకు పొడిగించినట్లు తెలిపారు. అలాగే ఇ క్రాప్ అనంతరం ఇ కేవైసీ చేయించుకోవాలన్నారు.

కుటుంబ భవిష్యత్‌కు మహిళలు పునాది లాంటివారు


మాట్లాడుతున్న ఎస్ఐ రంగారావు

వేంపల్లె : దేశ కుటుంబ భవిష్యత్‌కు మహిళలు పునాది లాంటివారని వేంపల్లె ఎస్ఐ రంగారావు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉమెన్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంగరావు విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే తరాలకు మహిళలు ఆదర్శంగా జీవించాలని ప్రతి మహిళ దేశ పురోభివృద్ధికి పాటు పడాలన్నారు. అలాగే మహిళలు వివిధ సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో సాధించిన విజయాల గురించి వివరించారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని, తమ మొబైల్ ఫోన్ వినియోగంపై జాగ్రత్తలు పాటించాలన్నారు.. అనంతరం విద్యార్థినులకు పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మహిళా దినోత్సవం రోజున వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సభ్యురాలు డాక్టర్ మల్లేశ్వరమ్మ, లైబ్రేరియన్ మాధవరావు, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర తదితరులు పాల్గొన్నారు.